సాక్షి
చిత్తూరు
గురువారం। 4 । ఏప్రిల్ । 2024


సదుం రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పక్కన మంత్రి పెద్దిరెడ్డి


పూతలపట్టులో అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మండుటెండ..

నువ్వే గుండె నిండా!

ఉమ్మడి చిత్తూరు జిల్లా మురిసిపోయింది. ప్రచండ భానుని ఎదురొడ్డి అభిమాన కెరటం ఉవ్వెత్తున ఎగసిపడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. జగనన్న జైత్రయాత్రకు ఊరూవాడా కదిలివచ్చింది. దారిపొడవునా హారతులు పట్టి.. పూల వర్షం కురిపించి ఆనందోత్సాహాలను చాటుకుంది. 'నువ్వే కావాలి.. మళ్లీ నువ్వేరావాలి' అంటూ ఉద్వేగంతో నినదించింది. కుట్రల కూటమిని ఓడించేందుకు 'మేమంతా సిద్ధం' అంటూ ప్రతినబూనింది. సంక్షేమ సారథితో సెల్ఫీలు దిగేందుకు యువత పోటీపడింది. జగన్ మామను చూడాలని విద్యార్థి లోకం మేదలెక్కగా.. మనవడిని మనసారా ఆశీర్వదించేందుకు తరలివచ్చిన పండుటాకులను చూసి జన హృదయం ఉప్పొంగింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బస్సు యాత్ర జిల్లాలో మొదటి రోజు ఆద్యంతం అశేష జనసందోహం నడుమ కొనసాగింది.


అభ్యర్థులు కృపాలక్ష్మి, విజయానందరెడ్డి, సునీల్‌కుమార్, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వెంకటేగౌడ, భరత్, రెడ్డెప్ప, ఆర్‌కే రోజాను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రకు పోటెత్తిన జనం

- అడుగడుగునా అపూర్వ స్వాగతం
- అశేష జనసందోహానికి ముఖ్యమంత్రి అభివాదం
- మహిళలు, యువతకు ఆత్మీయ పలకరింపు

సాక్షి, చిత్తూరు : ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రోడ్‌షో ఆద్యంతం జనసంద్రాన్ని తలపించింది. ముందుగా బుధవారం ఉదయం సదుం మండలం అమ్మగారి పల్లె నుంచి బస్సు యాత్ర మొదలైంది. జాండ్రపేట , సదుం, బట్టువారిపల్లె, ఎరుకులపురం, గొడ్లవారిపల్లె, బూరగమంద క్రాస్, పులిచెర్ల మండలంలోని శ్రీనివాసపురం, చల్లావారి పల్లి, కల్లూరు వరకు కొనసాగింది. అనంతరం చంద్రగిరి నియోజకవర్గం దామలచెరువు మీదుగా పూతలపట్టు నియోజకవర్గంపాలకల సంతగేటి, తలుపులపల్లె, తేనెపల్లెకు చేరుకుంది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత రంగంపేటక్రాస్ మీదుగా సీఎం వైస్ జగన్ బస్సు యాత్ర బహిరంగ సభామైదానంలోకి ప్రవేశించింది. సభ అనంతరం రాత్రి 7 గంటలకు ముఖ్యమంత్రి రోడ్ షో రంగంపేట క్రాస్ మీదుగా తిరుపతి జిల్లాకు చేరుకుంది.

సదుం, కల్లూరు, దామలచెరువులో జన సమ్మోహనం

పుంగనూరు నియోజవర్గం సదుం, కల్లూరుతోపాటు చంద్రగిరి నియోజక వర్గం దామలచెరువులో సీఎం జగన్ రోడ్ షో అద్భుతంగా సాగింది. మండుటెండనూ లెక్క చేయకుండా జనం వేలాదిగా తరలివచ్చారు. మిట్ట మధ్యాహ్నం సుమారు 43 నుంచి 44 డిగ్రీల ఎండ తీవ్రత ఉన్నా ప్రజలు నిరీక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైతం ప్రజలకు అభివాదం చేస్తూ ఆత్మీయంగా పలకరించారు. ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపులా మిద్దెలపై నుంచి జనం పూల వర్షం కురిపించారు.

అవ్వకు అభయం!

సదుం మండలం గొడ్లవారి పల్లికి చెందిన సల్లాపు రమ్మ అనే వృద్ధురాలి సమస్య పరిష్కరిస్తామని సీఎం జగన్ భరోసా ఇచ్చారు. బస్సు దగ్గరకు వచ్చిన వృద్ధురాలిని గమనించి ముఖ్యమంత్రి తానే కిందకు దిగి వచ్చి పలకరించారు. ఈ సందర్భంగా వృద్ధురాలు మాట్లాడుతూ తనకు కిడ్నీ ఆపరేషన్ జరిగిందని, చేతివేళ్లు లేవని, ఎలాంటి ఆధారం లేదని, రూ.3వేల పింఛన్ సరిపోవడం లేదని విన్నవించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ఆమెను అక్కున చేర్చుకుని అండగా ఉంటామన్నారు.

సర్పంచ్‌తో మాటామంతీ..

సదుం మండలం ఎర్రాతివారిపల్లె సర్పంచ్ కళావతితో సీఎం జగన్ ముచ్చటించారు. ప్రభుత్వం అందించే పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా.? అంటూ ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సంక్షేమ ఫలాలు పేదలకు చేరుతున్నాయని, జనం సంతోషంగా ఉన్నారని సర్పంచ్ బదులివ్వడంతో ముఖ్యమంత్రి చిరునవ్వులు చిందించారు.

భారీగా బైక్ ర్యాలీ

రంగంపేట క్రాస్ వద్ద చిత్తూరు జిల్లా యూత్ వింగ్ ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు భారీగా బైక్ ర్యాలీ చేపట్టారు.

ముస్లింలకు అండగా ఉంటాం..

సదుంలో రోడ్ షో సందర్భంగా ముఖ్యమంత్రిని పెద్దసంఖ్యలో ముస్లింలు కలిశారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు మద్దతు ఇవ్వవద్దని విన్నవించారు. దీనిపై సీఎం జగన్ సానుకూలంగా స్పందించారు. ముస్లింలకు అండగా ఉంటామని, వారిని ఇబ్బంది పెట్టే ఎలాంటి చట్టాలకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇవ్వదని స్పష్టం చేశారు.


దామలచెరువులో భారీ క్రేన్‌లతో గజమాలలు వేసి సీఎం వైఎస్ జగన్‌కు అపూర్వ స్వాగతం (ఇన్‌సెట్) ముఖ్యమంత్రితో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి

ఏమి జనాలబ్బా సామీ!

పలమనేరు : జగన్ మీటింగ్ యాడ జరిగినా ఏమి జనాలబ్బా సామీ..నా కేమీ అర్థం కాలేదు. మొన్న చంద్రబాబు వచ్చిన పొద్దు నువ్వేమో టీడీపీ వస్తాది అని చెబ్తివి.. కానీ, జగన్ మీటింగ్‌లకు పోతున్న జనాన్ని చూస్తాంటే నా బుర్ర పనిచేయలేప్పా.. అన్నాడు మొగిలప్ప పక్కనే ఉన్న రాజప్పతో. ఇది పలమనేరు టమాట మార్కెట్‌కు వచ్చిన ఇద్దరు రైతుల సంభాషణ.

రాజప్ప : ఈ టీడీపీవాళ్లేమో నేను కనిపించినప్పుడల్లా టీ తాగమని తీసిచ్చి ఎట్లా ఉందప్పా మన ఊర్లో మూమెంట్ అనేవారు. జనం మనసులో ఏముందో ఎట్టా తెలుస్తుందన్నా అంటే.. నువ్వు ఏడుండావు మా టీడీపీనే వచ్చేదని చెప్పిరి. నిజమేనేమో అనుకుని నీకు చెప్పినా.

మొగిలప్ప : టీడీపీవోళ్లు కాబట్టి అలా చెబ్తారు. నీ తెలివి ఏమైందిరా అక్కమ్మా. దినామూ మార్కెట్‌కొస్తా ఉంటావు. జనం మదిలో ఏముందో తెలుసుకోవద్దా. మంగళారం మదనపల్లెలో చూస్తివా, బుధారం పూతలపట్టులో సూస్తివా జనాలు ఎట్టా వచ్చారో.

ఇంతలో అక్కడికి చేరిన రైతులు : నాలుగేళ్లపాటు మేలు చేసిన జగన్‌కే ఓటేయాలని జనం మనసుల్లో ఎప్పుడో పెట్టుకున్నార్రా సామి. మా ఊర్లో ఆడోళ్లు, ముసలోళ్లు ఎవరినడిగినా ఫ్యాన్‌కేనంటా ఉండారు.


అన్న కరచాలనంతో అక్కచెల్లెమ్మల ఆనందం


వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరం


దీనజన బాంధవుడికి దిష్టి పోవాలంటూ..

ఓ తల్లికి భరోసా



రొంపిచెర్ల: నారాయణ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తమ బిడ్డ మృతి చెందాడని.. తమకు న్యాయం చేయాలని అబ్దుల్ నబీ, షాహీరా దంపతులు ముఖ్యమంత్రికి విన్నవించారు. సదుం మండలంలోని అమ్మవారిపల్లెలో ఈ మేరకు ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశారు. తిరుపతి వద్ద శ్రీనివాస మంగాపురం సమీపంలోని నారాయణ కాలేజీలో తమ కుమారుడు ''అయ్యా, మా రెండో కుమారుడు అబ్దుల్ నజీర్ (17) ఇంటర్ చదివేవాడన్నారు. 2021 ఫిబ్రవరి 21న కళాశాలలో కళ్లు తిరిగి కింద పడితే వెంటనే ఆస్పత్రికి తరలించలేదని, దీంతో తమ బిడ్డ మరణించాడని వివరించారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లి ఉంటే తమ కుమారుడు బతికేవాడని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణ కాలేజీ వారు తమపైనే కేసులు పెడతామని బెదిరించారని పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పందించారు. కేసును రీఓపెన్ చేయించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

జేసీబీలతో పూలవర్షం

సీఎం జగన్ బస్సు యాత్ర పూతలపట్టు నియోజవర్గంలోకి ప్రవేశించగానే పెద్దసంఖ్యలో ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పాలకల సంద గేటు వద్ద 10 జేసీబీలపై నుంచి పూలవర్షం కురిపించారు.

అన్నీ తామై..

సీఎం జగన్ బస్సు యాత్రను సూపర్ సక్సెస్ చేయడంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విశేషంగా కృషి చేశారు. యాత్రలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థులు మంత్రి రోజా, భరత్, విజయానందరెడ్డి, వెంకటేగౌడ, సునీల్ కుమార్, కృపాలక్ష్మి శ్రమించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

సదుం మండలం అమ్మగారి పల్లె బేస్ క్యాంపు వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణ వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే మాజీ జెడ్పీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి , కుప్పానికి చెందిన టీడీపీ నేతలు కృష్ణమూర్తి, బీతప్ప పార్టీలో చేరారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో తేనెపల్లె వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పలమనేరు టీడీపీ మాజీ ఎమ్మెల్యే లలితా కుమారి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్ పాల్గొన్నారు.

చంద్రగిరి..అభిమాన సిరి

తిరుపతి రూరల్/పాకాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు నీరాజనాలు పట్టారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలాది మంది అపూర్వ స్వాగతం పలికారు. సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర పాకాల మండలం పదిపట్లబైలు నుంచి దామలచెరువు మీదుగా పూతలపట్టు నియోజకవర్గంలోకి ప్రవేశించేవరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా జనం బారులతీరారు.

సంప్రదాయబద్ధంగా స్వాగతం

పదిపట్లబైలు గ్రామానికి బస్సు యాత్ర చేరుకోగానే 61 మంది కళాకారులు మంగళ వాయిద్యాలతో సంప్రదాయబద్ధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికారు. 1001 మంది మహిళలు గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. దామలచెరువు వద్ద 45 భారీ క్రేన్‌లతో 45 గజ మాలలను సీఎం జగన్‌కు వేసి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

10 వేల మందికి భోజనాలు

సిద్ధం బస్సు యాత్రకు దాదాపు 10 వేల మందికి పైగా తరలివచ్చారు. వారందరికీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భోజన ఏర్పాట్లు చేశారు.

ఆప్యాయంగా పలకరించి..

మోహిత్‌రెడ్డితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆత్మీయంగా మాట్లాడారు. బాగున్నావా మోహిత్ అని ఆప్యాయంగా పలకరించారు.


దామలచెరువు వద్ద సీఎం జగన్‌కు దిష్టితీస్తున్న మహిళలు


మహానేతకు జననేత నివాళి


చంద్రగిరి నియోజకవర్గం తనపల్లె క్రాస్ వద్ద స్వాగతం పలుకుతున్న అభిమానులు



బైరెడ్డిపల్లె: పింఛను కోసం అవస్థలు పడుతూ సచివాలయానికి వస్తున్న వృద్ధురాలు

'బాబో'య్ మాకేంటీ కష్టాలు

మాపై నీకేంటి ఈ కక్ష... మేం చేసిన పాపమేంటి. వలంటీర్లు మా ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తే మీకు వచ్చే నష్టమేంటి. మండుతున్న ఎండల్లో మాకు ఈ తిప్పలేంటి అంటూ చంద్రబాబుపై వృద్ధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూర్చుంటే లేవలేని ఈ వయసులో తమకు ఇవేం అవస్థలు అంటూ శాపనార్థాలు పెడుతున్నారు. పెన్షన్లను వలంటీర్లు పంపిణీ చేయకూడదని చంద్రబాబు అండ్ కో ఫిర్యాదు చేయడం వల్లే తమకు ఈ దుస్థితి దాపురించిందని మండిపడుతున్నారు. తీవ్రమైన ఎండలో సచివాలయాలకు వచ్చి పెన్షన్ తీసుకోవడం చాలా ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ పాలనలో పరిస్థితి మళ్లీ కళ్లకు కట్టినట్లు ఉందని వాపోతున్నారు. బాబు అధికార దాహానికి.. స్వార్థ రాజకీయాలకు ఎంత మంది బలికావాలో అని ఆందోళన చెందుతున్నారు. ఇన్ని కష్టాలకు కారణమైన బాబుకు తమ ఉసురు తగులుతుందని స్పష్టం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



రొంపిచెర్ల మండలం వారణాసిపల్లెకు చెందిన మంగమ్మ(80), బుద్ధిమాంద్యం గల తన మనవడు చలపతి(45)తో కలిసి పింఛన్ తీసుకునేందుకు మండుటెండలో సచివాలయానికి వెళుతున్న దృశ్యం

ఈ పాపానికి ఫలితం అనుభవిస్తారు



చంద్రబాబునాయుడుకు ఇప్పటికీ అధికార దాహం తీరలేదు. అందుకే ఇలా మమ్మల్ని బాధపెడుతున్నాడు. ఎన్నికల సమయంలో మేము ఈ మంచి పని చేస్తామని చెప్పాల్సింది పోయి, మాలాంటి ముసలోళ్లపైనా ఆయన ప్రతాపం చూపిస్తున్నారు. పొద్దుననగా ఇక్కడికి వచ్చా. డబ్బు కోసం బ్యాంకుకు వెళ్లారని చెప్పారు. ఇక అప్పటి నుంచి పడిగాపులే. గత టీడీపీ ప్రభుత్వంలో పడిన ఇబ్బందులు గుర్తుకు వచ్చాయి. సాయంత్రానికి నాచేతికి డబ్బు ఇచ్చారు. మధ్యాహ్నం తిండి లేక పస్తు ఉండాల్సి వచ్చింది. ఈ పాపానికి చంద్రబాబు ఫలితంఅనుభవిస్తారు. ఈ పాట్లు మరో రెండు నెలల పాటు ఉంటాయని చెబుతున్నారు. చాలా ఆందోళనగా ఉంది.

-వసంతమ్మ, ఎన్జీఓ కాలనీ, పుత్తూరు

మా పాలిట చంద్రబాబే శాపం



ఇంటి తలుపు తట్టి, చేతిలో డబ్బు పెట్టే మంచి ప్రభుత్వం వచ్చినందుకు సంతోషించా. వలంటీర్లు మా దగ్గరకు వచ్చి ఈ పథకం వచ్చిందా, ఆ పథకం వస్తుంది అని చెబుతుంటే జీవితంపై ఎంతో ఆశ ఏర్పడింది. ఎన్నికలు వచ్చేసరికి, ఇలా చంద్రబాబు మా నోటి కూడు తీసేస్తాడని, మా పాలిట శాపంగా మారుతాడనుకోలేదు. బాబు కాదన్నా నా మనవడు జగన్ ఉన్నాడు. ఎలాగోలా పింఛను చేతి లో పెట్టించాడు. ఎన్నికల తర్వాత మళ్లీ ఇంటి వద్దకే పింఛను వస్తుందన్న నమ్మకంతో ఉన్నా.

- సుబ్రమణ్యంరెడ్డి, జెండామానువీధి, పుత్తూరు

మళ్లీ వలంటీర్లే పింఛను ఇవ్వాలి



ఎలక్షన్ వచ్చిందని చంద్రబాబు వలంటీర్లను తీయించినాడు. సచివాలయాలకు మమ్మల్ని నడిపించినాడు. రెండ్రోజులకే మాలాంటి వాళ్లని ఇంత కష్టపెట్టిన చంద్రబాబు మళ్లీ వస్తే మాలాంటి ముసలోళ్లు ఇక చావాల్సిందే. మా ఇంట్లోవాళ్లని అడుక్కొని బండ్లో మూడు మైళ్ల దూరం నుంచి పింఛను కోసం వచ్చా. అందుకే ఆ భగవంతుని కోరుకుంటున్నా మళ్లీ జగనే రావాలి. వలంటీర్లే పింఛన్లు ఇవ్వాలి.

-చల్లప్ప, ఎర్రగొండేపల్లె, పలమనేరు మండలం

ఇంటికే తెచ్చి ఇచ్చేవాళ్లు



వలంటరు సిన్నోళ్లు ఇంటికే వచ్చి మా పింఛను మాకు ఇచ్చేవాళ్లు. మేము అందుబాటులో లేకున్నా, పింఛను ఇచ్చే ఫోన్లు పనిచేయక పోయినా ఇంటి దగ్గరే కాచుకుని ఉండి ఇచ్చిపోయేవాళ్లు. ఇప్పుడు పొద్దున్నే ఆఫీసుకు వచ్చి మెట్లపై కూసుని కాచుకుని ఉన్నా.. ఈ రోజు పింఛను ఇచ్చేలా లేరు. ఈ వయసులో మమ్మల్ని ఇట్టా సతాయించకుండా వలంటర్లతో పింఛన్‌ను ఇంటికే పంపిస్తేనే బాగుంటుంది. మా ఉసురు పోసుకొంటున్న చంద్రబాబును దేవుడు విడిచిపెట్టడు.

-వెంకటమ్మ, కెనమాకులపల్లె, శాంతిపురం మండలం



పలమనేరు: పింఛనుదారులతో కిటకిటలాడుతున్న గంటావూరు సచివాలయం

మా గోడు ఊరికే పోదు

ఒకటో తేది తలుపు తట్టి మరీ పుణ్యాత్ముడు పెన్షన్ ఇచ్చేవాడు. ఐదేళ్లపాటు మాకు ఎలాంటి తిప్పలు లేవు. ఇప్పుడేమో ఇంటివద్దకు వచ్చి పింఛన్ ఇవ్వడాన్ని చంద్రబాబు కంప్లెయింటు చేసి ఆపేశాడంట. పింఛన్ లేకపోతే నా బతుకు గడవదు. దూరమైనా నడిచి వెళ్లిపోదామని ధైర్యం చేసి మా ఊరోళ్ల చేతులు పట్టుకొని వచ్చా. ఎండలు ఎక్కువగా ఉండటంతో తట్టుకోలేకపోయా. కళ్లుతిరిగి పడిపోయా ఇక్కడోళ్లు వచ్చి నీళ్లుచల్లి లేపారు. ఇదేం ఘోరం మా లాంటి వారిపైనా ఆయన ప్రతాపం మా గోడు ఊరికే వదలదు.

- రామక్క, వెంకగన్న కండ్రిగ, నగరి మండలం.



రామక్కను చేయిపట్టుకుని తీసుకు వెళుతున్న తోటి పెన్షన్‌దారులు

మా ఉసురు తగులుతుంది.



మా ఉసురు చంద్రబాబుకు తప్పకుండా తగులుతుంది. ఇదివరకు ప్రతి నెలా 1వ తేదీ వేకువజామునే వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఎండా, వానా, తుపాన్, కరోనా సమయంలో కూడా క్రమం తప్పకుండా నగదు అందించేవాడు. అయితే టీడీపీ వాళ్ల కుట్రల వల్ల ఈ దఫా పింఛన్ రాలేదు. సచివాలయానికి వస్తే డబ్బులు ఇస్తామన్నారు. అదేమో మా ఊరి నుంచి కిలోమీటర్ దూరంలో ఉంది. నడిచే వెళ్లేందుకు ఎండలో చాలా కష్టపడాల్సి వచ్చింది. మాబోటి వాళ్లపైన చంద్రబాబు ఎందుకు ఇంత కక్ష అర్థం కావడంలేదు. మా శాపం ఊరికే పోదు. అనుభవిస్తారు.

- రాణెమ్మ, విజయపురం దళితవాడ

కురుబ కులస్తులను ఆదుకుంటాం

పులిచెర్ల(కల్లూరు): కురుబలను అన్నివిధాలా ఆదుకుంటామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కురుబ కులస్తులకు భరోసా ఇచ్చారు. కల్లూరులో బుధవారం పుంగనూరు నియోజకవర్గ కురుబ కులస్తుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కురుబ కులస్తులు మాట్లాడుతూ తమను అన్ని విధాలా ఆదుకుంటున్న సీఎం జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో కురుబలు వైఎస్సార్‌సీపీకి అండగా ఉండి తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తామన్నారు. అనంతరం కురుబ నాయకులు కె.జి.కృష్ణమూర్తి, జబ్బాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో కురుబ సంఘం నాయకులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, మంత్రి రోజా, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో సీఎం జగన్‌ను సన్మానిస్తున్న కురుబ సంఘం నాయకులు

వైభవంగా సుగుటూరు గంగ జాతర





అమ్మవారి సన్నిధిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , జాతరకు హాజరైన జనసందోహం(ఇన్‌సెట్) విశేషాలంకరణలో సుగుటూరు గంగమ్మ

– నిమజ్జనంతో ముగిసిన సంబరం

పుంగనూరు : జమీందారుల కుల దైవం సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా రెండో రోజు బుధవారం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. తొలి, మలి పూజలు జమీందారులు నిర్వహించగా బెస్తవారు, యాదవ కులస్తులు, తోటి కులస్తులచే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సుగుటూరు గంగమ్మను , విరూపాక్షి మారెమ్మను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులను గెరిగెలతో ఆలయంలో మూడు ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

విశేష పూజలు :పట్టణంలోని విరూపాక్షి మారెమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. అలాగే బజారువీధిలో నడివీధి గంగమ్మ , తూర్పు మొగసాలలో గంగమ్మ , బాలాజి థియేటర్ వద్ద మలారమ్మ గంగమ్మ, మైసూర్ బ్యాంకు వద్ద నలగంగమ్మ, బస్టాండులో విరూపాక్షి మారెమ్మ, నల్లరాళ్లపల్లె వద్ద నలగంగమ్మ , కోనేరు వద్ద బోయకొండ గంగమ్మ, నానాసాహెబ్‌పేటలోని నడివీధి గంగమ్మలను ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

పోటెత్తిన భక్తులు : సుగుటూరు గంగమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. పురపాలక కమిషనర్ ఆధ్వర్యంలో భక్తులకు పకడ్బందీగా మౌలిక వసతుల కల్పించారు.

శాస్త్రోక్తంగా నిమజ్జనం :సుగుటూరు గంగమ్మ జాతర బుధవారం అర్ధరాత్రి ముగిసింది. అమ్మవారికి జమీందారులు మలి పూజలు నిర్వహించారు. రాత్రి పట్టణ పురవీధులలో ఊరేగింపు నిర్వహించి, గురువారం వేకువజామున శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. అనంతరం అమ్మవారిని విగ్రహాలను జమీందారులకు అప్పగించారు.

పింఛన్ కోసం వచ్చి.. ప్రమాదానికి గురై..!

చౌడేపల్లె : 'కడుపులో చల్ల కదలకుండా ప్రతి నెలా వలంటీర్ ఇంటికే పింఛన్ తెచ్చిచ్చేవాడు. ఈ దఫా వలంటీర్ రాడు.. మీరే వెళ్లి సచివాలయంలో పెన్షన్ తీసుకోండని చెప్పారు. ఆరోగ్యం సహకరించకపోయినా అవసరాలు తీర్చుకునేందుకు కాలూ చెయ్యి కూడదీసుకుని వెళ్లా.. తిరిగి వస్తుంటే ఏదో బండి వచ్చి కొట్టేసింది. పింఛన్ కోసం వస్తే ప్రాణాలే పోయేటట్టు ఉంది. ఏం చేయాలో తెలియడం లేదు.' అంటూ వసంతపల్లె మునస్వామి (75) అనే వృద్ధుడు కన్నీటిపర్యంతమయ్యాడు. వివరాలు.. చౌడేపల్లె మండలం పాదలపల్లెకు చెందిన మునస్వామి పెన్షన్ తీసుకుని ఇంటికి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని కుటుంబీకులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు.



గాయపడిన మునస్వామి

జిల్లాలో పకడ్బందీగా పింఛన్ల పంపిణీ

- కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ : 6300433367

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో పకడ్బందీగా పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్యతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. దీనిపై వచ్చే వదంతులు, అపోహలను నమ్మవద్దని ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. లబ్ధిదారుల కోసం కాల్‌సెంటర్ ఏర్పాటు చేశామని, ఎవరికైనా ఇబ్బందులుంటే 6300433367 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. జిల్లాలో ప్రతినెలా 2,74,553 మంది లబ్ధిదారులకు రూ.80.39 కోట్లు పెన్షన్ల కింద పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందులో అధికంగా 1,46,496 మందికి వృద్ధాప్య పెన్షన్ ఇస్తున్నామని వివరించారు. పలువురు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు ఆధార్ సీడింగ్ కాకపోవడంతో సచివాలయాల ద్వారా పంపిణీ చేయాల్సి వస్తోందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 వరకు పింఛన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సచివాలయాల్లో కౌంటర్లు, వసతులు ఏర్పాటు చేశామన్నారు. రాలేని స్థితిలో ఉన్న వారికి రెండురోజుల తర్వాత ఇంటికే వెళ్లి పింఛన్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 1,700 మంది సచివాలయ ఉద్యోగులు బీఎల్వోలుగా విధులు నిర్వహిస్తున్నరని, దీంతో అందరికీ పింఛన్లు అందించేందుకు వార రోజులు పడుతుందని వెల్లడించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, డీఎల్‌డీఓ రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన జేసీ శ్రీనివాసులు

తొలిరోజు 28.67శాతం పింఛన్ల పంపిణీ

- సచివాలయాల వద్ద వృద్ధుల పడిగాపులు
- ఎండ తీవ్రతకు ఇబ్బంది పడిన లబ్ధిదారులు

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ బుధవారం మందకొడిగా సాగింది. సచివాలయాల వద్ద ఉదయం నుంచే వృద్ధులు బారులు తీరారు. బ్యాంకుల నుంచి నగదు విత్ డ్రా చేసుకుని మధ్యాహ్నం తర్వాత పింఛన్ల పంపిణీ చేపడుతామని సచివాలయ సిబ్బంది చెప్పడంతో లబ్ధిదారులకు పడిగాపులు తప్పలేదు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో పలువురు లబ్ధిదారులు నానా అవస్థలు పడ్డారు. ఇక దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్నవారు పింఛన్ ఎప్పుడు వస్తోందో అంటూ ఇంట్లోనే ఎదురు చూస్తున్నారు. ఐదేళ్ల పాటు వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందించడంతో సౌకర్యవంతంగా ఉండేదని, ఇప్పుడు వారిని పక్కన పెట్టడంతో తిప్పలు తప్పడం లేదంటూ పలువురు వాపోయారు. జిల్లాలోని మొత్తం 2,74,553 మంది పెన్షనర్లకు గాను 28.67 శాతం మాత్రమే బుధవారం పంపిణీ చేశారు. ఇది వరకు వలంటీర్లు ఒకటో తేదీనే దాదాపు 90శాతం వరకు పింఛన్ల పంపిణీని పూర్తి చేసేవారు. ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారికి సైతం అక్కడికే వెళ్లి నగదు అందించేవారు. ఆ రోజులను గుర్తుచేసుకుని పెన్షనర్లు నిట్టూరుస్తున్నారు. గత టీడీపీ హయాంలో మాదిరిగానే మళ్లీ పడిగాపులు, ప్రదక్షిణలు చేసే రోజులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి తొలి ర్యాండమైజేషన్

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల సిబ్బందికి విధుల కేటాయింపునకు సంబంధించి గురువారం తొలి ర్యాండమైజేషన్ చేపట్టనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తొలి ర్యాండమైజేషన్‌లో పీఓ, ఏపీఓ, ఓపీఓలకు సంబంధిత నియోజకవర్గం, మండలాలను కేటాయించనున్నట్లు వెల్లడించారు. పీఓలుగా ఉపాధ్యాయులు, ఈఈలు, డీఈలు ఏపీఓలు, ఓపీఓలుగా ఇతర సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపిన సమస్యలు, ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జేసి శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి సూర్యప్రతాప్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు భాస్కర్, పరదేశి, టీడీపీ ప్రతినిధులు సురేంద్ర కుమార్, కొండయ్య పాల్గొన్నారు.

నిబంధనల మేరకే..

జాతీయ నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఎన్నికల నిబంధనల మేరకే నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈనెల 5న బాబు జగ్జీవన్ రామ్, 14న అంబేడ్కర్ జయంతి కార్యక్రమాల నిర్వహణపై దళిత సంఘాల నేతలతో సమావేశమయ్యారు. చిత్తూరు గంగినేని చెరువు సమీపంలోని జగజ్జీవన్‌రామ్ విగ్రహం, దర్గా సర్కిల్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాలు, ర్యాలీలు ఉంటాయని వెల్లడించారు. సమావేశంలో డీఆరఓ పుల్లయ్య, జేడీ సోషల్ వెల్ఫేర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మహిళ మృతదేహం



పుత్తూరు : వడమాలపేట మండలం తడుకు రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మహిళ (33) మృతదేహాన్ని బుధవారం రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే ఎస్ఐ కె.రవి మాట్లాడుతూ మృతురాలి ఒంటిపై పింక్ కలర్ జాకెట్టు, పచ్చరంగు చీర ఉన్నట్లు తెలిపారు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నామని వెల్లడించారు. పోస్టుమార్టం నిమి త్తం మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బస్సును ఢీకొన్న టెంపో: డ్రైవర్‌కు గాయాలు

బైరెడ్డిపల్లె : పలమనేరు- కుప్పం జాతీయ రహదారిలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం ఉదయం ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును టెంపో ఢీ కొంది. దీంతో నెల్లూరుకు చెందిన టెంపో డ్రైవర్ బాబు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని కుప్పం పీఈఎస్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ధ్వంసమైన టెంపో

మే 11న జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు అర్బన్: జిల్లావ్యాప్తంగా మే 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణ్ కుమార్ తెలిపారు. బుధవారం చిత్తూరులోని న్యాయ సేవా భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లా కేంద్రంతోపాటు 13 మండల న్యాయసేవాధికార సంస్థల్లో అదలత్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లోక్అదాలత్‌లో పెండింగ్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ క్రమంలోనే శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా బాలల వికాసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆపరేషన్ స్వేచ్ఛ చేపట్టనున్నట్లు తెలిపారు. బడి బయటి పిల్లలను గుర్తించి బడికి పంపేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.



కరుణకుమార్, న్యాయమూర్తి